# దగ్గే-మందు

## -రామకృష్ణ కోట

''ఒక్కక్షణం విశ్రాంతి లేకుండా దగ్గకపోతే ఒక సారి వెళ్ళి డాక్టర్ని చూసి రాకూడదూ!''

విసుగ్గా అంది ఏకాంబరం భార్య కనకాంబ రమ్మ.

''డాక్టర్ పదింటికిగానీ రాడుగా!'' అని దగ్గుతూనే అన్నాడు.

కనకాంబరమ్మ కావాలనే ఒక గిన్నెని క్రింద పడేసింది! ''చూశారా! మీ దగ్గుతో నా ఒళ్ళు కూడా అదిరిపోతుంది''

''అబ్బ ఆపవే నీ గోల. వెళ్తానన్నా నుగా, అనవసరంగా ఆ గిన్నెలన్నీ సొట్టలు పడెయ్యకు'' అంటూ లేచి డ్రస్ చేసుకుని మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు.

''మళ్ళీ కూర్చున్నారే'' మందలింపుగా అంది.

''టైం తొమ్మిదేగా, నాలుగడుగులు ఎంతసేపు వెళ్ళాలి'' అని కొంచెం స్వరాన్ని పెంచి అని వెంటనే దగ్గు తెర రావటంతో దగ్గటం మొదలుపెట్టాడు.

''ఇప్పటికి పదిహేను రోజులనుంచీ దగ్గుతూనే ఉన్నారు. మీ దగ్గుకి బెదిరి ఉదయం పూట మన గేదె బెదిరి పాలి వ్వటం మానేసింది. ఇక చిన్నాడి సంగతి చెప్పేదేముంది. మీ దగ్గూ, వాడి ఏడుపూ. మెల్లగా నడుచుకుంటూ వెళ్ళండీ. అదే పెద్ద కాలక్షేపం''

ఏకాంబరానికి కుర్చీలోంచి లేవక తప్పింది కాదు. లేచి రోడ్డెక్కాడు.

పెద్దగా దగ్గుతూ, రోడ్డు మీద మెల్లగా నడుస్తున్నాడు.

వెనకనించి స్పీడుగా వస్తున్న ఓ లారీ వాడు సడన్ బ్రేకు వేసి ''ఏం నాయనా. ఇంట్లో చెప్పేవచ్చావా? చీమలు చస్తా యనా, అంత చిన్నగా నడుస్తున్నావ్'' అని కసురుకున్నాడు డ్రైవర్.

''ఆస్పత్రికి వెళ్తున్నా. డాక్టరు పదింటి కిగానీ రాడు. మా ఆవిడ కాలక్షేపం కోసం మెల్లగా నడుచుకుంటూ వెళ్ళమంది'' అని దగ్గుతూనే అన్నాడు ఏకాంబరం అమాయ కంగా.

''కాలం చేయటం కోసమేమో అని నా లారీ అనుకుని ఉంటే ఎంచక్కా పోస్ట్ మార్టం రూంకి వెళ్ళుండేవాడివి''

''నువ్వు జైలుకెళ్ళుండేవాడివి''

''నాకు కొత్తేమీ కాదులే'' అను కుంటూ ఏకాంబరం పక్కనుంచే స్పీడుగా పోనిచ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

ఏకాంబరం మెల్లగా నడుచుకుంటూ ఆస్పత్రి చేరుకున్నాడు.

''డాక్టర్‌గారు దగ్గు, జలుబు ప్రాణం తీస్తున్నాయి. దగ్గలేక ఛస్తున్నా''

''తెలుస్తూనే ఉంది''

''మీకెట్లా తెలుసు?'' అన్నాడు దగ్గు తూనే.

''ఈ ఊళ్ళో అందరికీ తెలుసు. మొన్ననే ఒక దొంగ వచ్చాడు. నీ దగ్గుతో వాడి పనులేవీ కావటం లేదని నానా బూతులూ తిట్టాడు.''

''ఎవరినీ?''

''నన్నే''

''మిమ్మల్ని ఎందుకుట తిట్టటం''

''నీకు మందివ్వనందుకు'' అని వెట కారంగా అంటూనే దగ్గుతున్న ఏకాంబ రాన్ని చూసి, ''ఏంటీ ఏదన్నా గమ్ కంపె నీకి కబురు పెట్టమంటావా?'' అని తనలో తానే నవ్వుకున్నాడు.

''ఎందుకు''

వాళ్ళొక ప్లాస్టిక్ డ్రమ్ పంపిస్తారు. ఎప్పుడు దగ్గొచ్చినా దాన్ని ఉమ్మి తొట్టి లాగా ఉపయోగించావనుకో, వాళ్ళకి గమ్ తయారుచేసే బాధే ఉండదు''

విషయం అర్థంకాని ఏకాంబరం అమాయకంగా ''నిజంగానా?'' అని అడి గాడు.

ప్రక్కనే ఉన్న నర్సు పెద్దగా నవ్వేసింది.

''ఇప్పుడు నన్నేం చెయ్యమం టారు?''

''వెళ్ళి ఫీజు కట్టి రశీదు తెచ్చుకో''

''తరువాత ఇవ్వకూడదా?''

''నాకు మతిమరుపు జాస్తి. అందు కని''

''నాకు వైద్యం చేయటం మర్చిపోతా రేమో''

''నేను మర్చిపోయినా నువ్వు దగ్గి మరీ గుర్తుచేస్తావుగా!''

ఐదు నిముషాల్లోనే రశీదుతో తిరిగి వచ్చి డాక్టర్ ప్రక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చున్నాడు.

నర్స్ ఆదుర్దాగా లోపలికి వచ్చి, ''డాక్టర్...నిన్న మీరు ఆపరేషన్ చేసిన మనిషి కళ్ళు తేలేసాడు. పల్స్ చాలా బల హీనంగా ఉంది. గుండె ఆడుతోందో లేదో అనుమానంగా ఉంది.''

డాక్టరు కంగారుగా ''ముందు మన ఆస్పత్రి ఫీజు తీసుకోండి. తీరా పోయిన తరువాత వాళ్ళు మనిషి పోయి ఏడుస్తుంటే మనం ఫీజు పోయినందుకు ఏడవాలి''

ఇంతలోనే ఏకాంబరం ఆ బిల్డింగ్ దద్ద రిల్లేలా దగ్గుతున్నాడు.

డాక్టర్ కోపంగా, ''కాసేపు నీ దగ్గు ఆపవయ్యా బాబూ'' అన్నాడు.

''మీరు మందివ్వండి'' అనటంతోనే నర్సు నవ్వు ఆపుకోలేకపోయింది.

డాక్టర్‌లో కోపం స్థాయి మరికొంచెం పెరిగింది.

''ఎందుకు అంత నవ్వు?''

''మీరు మందిస్తే దగ్గు తగ్గిపోతుంద నుకుంటున్నారు ఆయన''

''ఏం తగ్గదా?''

''అందుకేగా గిన్నీస్ బుక్‌వాళ్ళు ఎదురు చూస్తున్నారు''

డాక్టర్‌లో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

''థాంక్యూ సిస్టర్. గిన్నీసు బుక్ గుర్తు చేసి ఒక మంచి ఆలోచన నాలో కలిగిం చావ్.''

నర్సు ఆశ్చర్యంగా, ''ఏంటిసార్ అంత గొప్ప ఆలోచన?''

''గిన్నీస్ బుక్‌లోకి ఎక్కేది నేను కాదు''

''అది పెద్ద ఎత్తేమీ ఉండదు సార్'' అని తన ధోరణిలో అంది నర్సు.

''అది ఎంత ఎత్తున్నా ఎక్కే సత్తా మన ఏకాంబరం దగ్గరుంది''

''అదెట్లా సార్?''

డాక్టర్ నర్సుని ప్రక్కకి తీసుకెళ్ళాడు. మెల్లగా చెవిలో ''ఆ ఆపరేషన్ చేయించు కున్న మనిషిని బ్రతికిస్తే వాళ్ళు ఎంతిస్తారో కనుక్కో''

''ఆపరేషన్ చేసిందే అందుకు కదా సార్!''

''చేసింది అందుకే బ్రతుకుతాడని, కానీ వాడికి ఆయుష్షు లేకపోతే మనమేం చేయగలం''

''మరి ఇప్పుడేగా బ్రతికిస్తే ఎంత ఇస్తారో కనుక్కోమంటున్నారు''

''అది మన ఆపరేషన్ ప్రభావంతో కాదు''

''మరి''

''అది రహస్యం. నువ్వు వెంటనే వెళ్ళి అడిగిరా. పో'' అని పంపించేసాడు.

ఏకాంబరం ఆ టేబుల్ పట్టుకుని విశ్రాంతి లేకుండా దగ్గుతూనే ఉన్నాడు. టేబుల్ మీద ఉన్న ఆర్టికల్స్ ఒకటి తరు వాత ఒకటి క్రింద పడిపోవటం గమనిం చాడు. గబగబా ఏకాంబరం దగ్గరగా వచ్చి, ''టేబుల్ వదిలిపెట్టి దగ్గు'' అని సీరియస్‌గా అన్నాడు.

★★★

నర్సు ఆపరేషన్ చేయించుకున్న పేషంట్‌ని సమీపించింది. అతని చుట్టూ ఉన్న బంధువుల్ని ప్రక్కకి పిలిచింది.

''ఆయన్ని బ్రతికిస్తే ఎంతిస్తారో డాక్ట

**కొంచెంసేపు తటపటాయించాడు. ఆ మొహంలో రకరకాలు భావాలు. అన్నీ భావాల్లోనూ తండ్రిని చంపటానికే ఆ ఆస్పత్రికి తీసుకవచ్చిన ఫీలింగ్ స్పష్టంగా కనిపిస్తోంది. అయినా పైకి మాత్రం ''బ్రతికించుకోవటానికే!'' అనేసాడు. ఈ వార్త విన్న డాక్టర్, ఏకాంబరాన్ని తీసుకుని గబగబా ఆ పేషంటున్న గదిలోకి నడిచాడు.**

రుగారు అడిగి రమ్మన్నారు.''

''నిన్ననేగా ఆపరేషన్‌కి పదివేలి చ్చింది''

''అది ఆపరేషన్‌కి, ఆయుష్షుకి కాదుగా!''

''ఆపరేషన్ చేస్తే బ్రతకరా?''

''అది ఈ ఆస్పత్రి చరిత్రలోనే లేదు. మొదటిసారిగా డాక్టరుగారు బ్రతకటానికి కూడా గ్యారంటీ ఇస్తున్నారు''

ఆ మనిషి చచ్చిపోతే ఆస్తిని పంచుకునే ఉద్దేశంతో ఉన్న బంధువులకి ఆ వార్త ఒక ఆశనిపాతంలా గోచరించింది. అందరికీ ఆ మనిషి చచ్చిపోవాలనే ఉంది. కానీ ఎవరూ బయట పడలేక పోతున్నారు. చివరికి కొడుకు, తండ్రి పరిస్థితిని గమనించాడు. ఎట్లాగూ బ్రతికే జాడ లేకపోవటంతో ''మేం ఇక్కడికి వచ్చిందే అందుకు'' అని రెండ ర్థాలు వచ్చేలా అన్నాడు.

''ఎందుకు, మొదటిదా నికా రెండవ దానికా?'' నర్సు గట్టిగా అడిగింది.

కొంచెంసేపు తటపటాయించాడు. ఆ మొహంలో రకరకాలు భావాలు. అన్నీ భావాల్లోనూ తండ్రిని చంపటానికే ఆ ఆస్పత్రికి తీసుకవచ్చిన ఫీలింగ్ స్పష్టంగా కనిపిస్తోంది. అయినా పైకి మాత్రం ''బ్రతికించుకోవ టానికే!'' అనేసాడు.

ఈ వార్త విన్న డాక్టర్, ఏకాంబరాన్ని తీసు కుని గబగబా ఆ పేషంటున్న గది లోకి నడిచాడు. ఏకాంబరాన్ని ఆ పేషంట్ ప్రక్కనే కుర్చీ వేసి కూర్చోబెట్టి అందరినీ బయటికి రమ్మని తలుపేసాడు.

ఒక అరగంట ఆగిన తరువాత లోపల నుంచి ఎవరో ''తలుపు తియ్యండి'' అంటూ అరుస్తున్నారు.

డాక్టర్ మెల్లగా తలుపు తీసాడు. ఎవరో కాదు. ఆపరేషన్ చేయించు కున్న పేషెంట్.

డాక్టర్ బిగ్గరగా ''సక్సెస్'' అని ఎగిరి గంతేసి వాళ్ళని ఒప్పందం ప్రకారం పది వేలు ఇవ్వమన్నాడు.

పదివేలు డాక్టర్ చేతులో ఉంచి, ''మీ బ్యాడ్ లక్'' అన్నాడు కొడుకు.

''ఎందుకు?''

''చచ్చి ఉంటే యాభైవేలు ఇచ్చి ఉండేవాడ్ని. ఆ నమ్మకంతోనే ఇక్కడికి వచ్చింది.''

నలభైవేలు పోయినా బాధపడలేదు డాక్టర్. గిన్నీసు బుక్ ఛాన్స్ లభించినం దుకు సంబరపడిపోయాడు.

ఏకాంబరాన్ని తీసుకుని తిరిగి తన రూంకి వచ్చాడు డాక్టర్.

అన్ని పరీక్షలూ చేసి ప్రిస్క్రిప్షన్ వ్రాసి ఇచ్చాడు.

''మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు?'' అడిగాడు ఏకాంబరం.

''ఉంటే నాలుగు రోజులాగి కన పడు''

ఏకాంబరం భయంగా ''పోవటం గ్యారం టీనా''

''ఎస్'' అని పరధ్యానంలో అన్నాడు.

ఏకాంబరం కోపంగా ఆ ప్రిస్క్రిప్షన్ టేబుల్ మీద పడేసి ''నా ఫీజు నాకిచ్చె య్యండి'' అన్నాడు.

డాక్టర్ అనుమానంగా చూస్తూ ''ఆ చీటీలోని మందులు నీ పుస్తకంలో వ్రాసుకు న్నావా?''

''పోవటానికి ఈ మందులెందుకు. మీకంటే ఆ లారీవాడే నయం. పైసా ఖర్చు లేకుండా కాలంచేసే ఏర్పాట్లు చేస్తాన న్నాడు''

డాక్టర్ తన మాటల్లోని పొరపాటు గ్రహించి, ''నో నో. నే పోతుందన్నది నీ ప్రాణం కాదు, నీ దగ్గు''

''థాంక్స్ డాక్టర్. మా వీధిలో వాళ్ళంతా నీ దగ్గుతో మా ప్రాణం తీస్తున్నా వంటున్నారు. మొన్నటికి మొన్న ఎవరో ఇద్దరు నన్ను పిచ్చి పిచ్చిగా కొట్టారు''

''ఎందుకు'' బాధ నటిస్తూ అడి గాడు.

''ఎవరో దొంగలట. వాళ్ళకి నేను అడ్డంగా ఉన్నానట. దగ్గుకి మందు తీసుకో కపోతే నా ప్రాణం తీస్తామని బెదిరించారు''

డాక్టర్ తనలో తానే నవ్వుకుని, ''వాళ్ళకేం తెలుసు నీ దగ్గు శవాన్ని కూడా లేచి పారిపోయేలా చేస్తుందని'' అని మెల్లగా అన్నాడు.




★★★

మందుల షాపులో మందులు తీసు కుని దగ్గుకుంటూనే ఇంట్లో అడుగుపె ట్టాడు ఏకాంబరం.

''ఏమన్నాడు డాక్టర్'' అడిగింది భార్య విసుగ్గా.

''మందులు వ్రాసిచ్చాడు. ఉంటే నాలుగు రోజులాగి కనపడమన్నాడు''

''ఎవరు, మీరా? మేమా?''

ఏకాంబరం అమాయకంగా, ''ఎవ రుంటే వాళ్ళు'' అని మందు వేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

రెండురోజులు గడిచిపోయాయి. ఏకాంబరం దగ్గు తగ్గుమొహం పట్టింది.

తెల్లారి ప్రొద్దున్నే ఏకాంబరం భార్య గేదెల దగ్గర పాలు తీస్తోంది. ఎంత పిండినా పాలు రాకపోవడంతో బిగ్గరగా ''ఏవండీ!'' అని పిలిచింది.

ఏకాంబరం వచ్చి, ''ఏవిటీ ఆ గావు కేక?''

''మీ దగ్గుకంటేనా. వెంటనే కుర్చీ తీసుకువచ్చి ఇక్కడే కూర్చుని కాసేపు దగ్గండి'' ఆర్డర్ జారీచేసింది.

''ఎందుకట?''

''ఈ గెదె కూడా మీ దగ్గుకి అలవాటు పడింది''

పాలు పిండుకుని ఇంట్లోకి వచ్చింది. కాఫీ తీసుకువచ్చి చేతికిస్తూ ''అలాగే ఇంకొక్కసారి దగ్గండి''

''ఈసారెందుకు?''

''రెండోవాడికి నిన్న పొద్దుననగా అయింది మోషన్. పిచ్చివెధవ మీ దగ్గుకి అలవాటు పడ్డాడు'' అని సమాధానం వ్యంగ్యంగా చెప్పింది.